


కేంద్ర ప్రభుత్వం 2005లో జాతీయ విద్యా ప్రణాళిక చట్రం (ఎన్‌సిఎఫ్-2005) తయారు చేసింది. మన రాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్ర అవసరాలు, పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం-2011 రూపొందించటానికి నిర్ణయించి జాతీయ స్థాయి విషయ నిపుణులు, ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, విశ్వ విద్యాలయ ఆచార్యులు మొ॥ వారితో సలహా సంఘం, స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. వివిధ సబ్జెక్టులు, సహ పాఠ్యాంశాలకు చెందిన 18 అంశాలపై ఆధార పత్రాలు రూపొందించటానికి ఒక్కొక్క అంశంపై ఒక్కొక్క ఫోకస్ గ్రూపు నియమించారు. రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం-2011 కోసం 18 ఆధార పత్రాలు రూపొందించటానికి ఈ క్రింది నివేదికలు పరిగణలోకి తీసుకొన్నారు.

1. భారత రాజ్యాంగ ప్రవేశిక మరియు 73,74వ రాజ్యాంగ సవరణలు
2. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005
3. భారత ప్రభుత్వ నివేదిక - భారంలేని విద్య
4. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009
5. ఉపాధ్యాయ విద్య జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2010
6. జాతీయ విజ్ఞాన కమీషన్ ప్రతిపాదనలు.

**SCF-2011 పై**
**అభిప్రాయాలు తెలపండి**

రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం-2011 డ్రాఫ్ట్‌పై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల అభిప్రాయాలను, సూచనలను నవంబర్ 30లోగా తెలపాలని ప్రభుత్వం కోరింది. ఎస్‌సిఎఫ్-2011 పత్రాలన్నీ apscert.org, aputf.org వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నాయి. ఉపాధ్యాయులు అధ్యయనం చేసి తమ సూచనలను గడువులోగా **డైరెక్టర్, SCERT, ఎల్‌బి స్టేడియం 'ఇ గేట్' ఎదురుగా, బషీర్‌బాగ్, హైదరాబాద్ అడ్రస్‌కు తెలియజేయాలి.** యుటియఫ్ రాష్ట్ర కార్యాలయానికి కూడా పంపితే అన్నింటినీ క్రోడీకరించి యుటియఫ్ పక్షాన ప్రాతినిధ్యం చేస్తాము. email ద్వారా పంపేవారు apscert@yahoo.com, aputf@yahoo.com కు పంపవచ్చు.

పై నివేదికలకు చెందిన ప్రతిపాదనల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం-2011 ముసాయిదా ప్రతిపాదించారు. వీటి ఆధారంగా వివిధ సబ్జెక్టులు, సహ పాఠ్యాంశాలకు చెందిన ఆధార పత్రాలను, సిలబస్‌ను, విద్యా ప్రమాణాలను రూపొందించారు. పాఠ్య పుస్తకాలను ఆధునీకరించి, మూల్యాంకనం మరియు పరీక్షల్లో సంస్కరణలు చేపడతారు. రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం-2011 ప్రతిపాదించిన రాష్ట్ర దృక్పథాన్ని, ఏపిఎస్‌సిఎఫ్-2011 కీలక సూత్రాలు ఇలా ఉన్నాయి.

**మన రాష్ట్ర దృక్పథం :**

- విద్య యొక్క ప్రాథమిక ఉద్దేశ్యం పిల్లలందరినీ బాధ్యతా యుతమైన, హేతుబద్ధమైన పౌరులుగా తయారు చేయటం.
- విద్యా ప్రణాళిక రూప కల్పనలో పిల్లల అవసరాలు, కోరికలు కేంద్ర బిందువులుగా ఉండటం
- పిల్లలు నేర్చుకోవటంలో ఒక జ్ఞానాత్మక క్రమం ఉంటుంది. విద్యా ప్రణాళికను ఈ క్రమం మరియు పిల్లల మానసిక స్థాయిల ఆధారంగా రూపొందించటం ఫలితాల కంటే వాటిని

పొందే ప్రక్రియలను పరిపుష్టి చెయ్యటానికి అధిక ప్రాధాన్యత నివ్వటం

- విద్యా ప్రణాళిక గతిశీలమైనది. ఇది పాఠ్య పుస్తకాలకే పరిమితం కారాదు. ఇది పరిసరాలు, బాహ్య ప్రపంచంతో అనుసంధానమై పిల్లలు, ఉపాధ్యాయుల సృజనాత్మకతను పెంచటానికి దోహద పడాలి.
- విద్యా ప్రణాళికతోపాటు, విద్యా పరిపాలన, పాఠశాలకు చెందిన అన్ని కార్యకలాపాలలో వికేంద్రీకరణను అమలు చేయటం

**ఏపిఎస్‌సిఎఫ్-2011 మౌలిక సూత్రాలు**

- పిల్లలు తమకున్న సహజమైన శక్తి సామర్థ్యాల ఆధారంగా నేర్చుకొనేలా ప్రధానంగా దృష్టి పెట్టటం.
- పిల్లల భాష మరియు సమాజంలోని వివిధ జ్ఞాన వ్యవస్థలను గౌరవించటం, వాటిని అభ్యసనంలో వినియోగించటం
- జ్ఞానాన్ని బడిబయటి జీవితంతో అనుసంధానం చేయటం
- బట్టీ విధానానికి స్వస్తి పలకటం.
- నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం అమలు చేయటం ద్వారా పరీక్షలను సరళీకరించి బోధనాభ్యసన ప్రక్రియల్లో అంతర్భాగం చేయటం. పిల్లలు నేర్చుకొనే దానికి దోహద పడేలా మూల్యాంకనా విధానాలను సంస్కరించటం
- పిల్లల సంస్కృతి, అనుభవాలు, స్థానిక అంశాలకు తరగతి గదిలో ప్రాధాన్యత కల్పించటం
- పాఠ్య ప్రణాళికలోని విభిన్న అంశాలను సమ్మిళితం చేస్తూ అర్థవంతంగా నేర్చుకోవటానికి వీలుగా సామాజిక నిర్మాణాత్మక, విధానాలను తులనాత్మక / విమర్శనాత్మక బోధనా విధానాల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించటం

రాష్ట్ర దృక్పథం మరియు కీలకాంశాల ఆధారంగా రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం-2011 రూపొందించారు. విద్యా ప్రణాళికా చట్రం -2011 రూపొందించటానికి నిర్దేశించిన 18 ఆధార పత్రాలు మూడు భాగాలుగా విభజించారు.

1. **విద్యా విషయక భాగం :** దీనిలో 7 పత్రాలు. ఇవి వివిధ బోధనా సబ్జెక్టులకు చెందిన అంశాలను చర్చించాయి. ఆయా సబ్జెక్టులు బోధించటంలో ఎదురౌతున్న ఇబ్బందులు, పాఠ్యాంశాల భారము, బోధనా నైపుణ్యాల లోటు, బోధనోప కరణాల లోటు, విద్యార్థికి ఆయా సబ్జెక్టులలో అనాసక్తి కారణాలు మొ॥ అంశాలపై చర్చించి మార్పు కోసం సూచనలు చేశాయి.
2. **వ్యవస్థాపక సంస్కరణలు :** ఈ భాగంలో 6 పత్రాలు ఉన్నాయి. అవి 1) విద్యా లక్ష్యాలు 2) వ్యవస్థాపక సంస్కరణలు 3) ఉపాధ్యాయ విద్య-ఉపాధ్యాయ వృత్తిపర అభివృద్ధి 4) అభ్యసనం కోసం మూల్యాంకనం 5) విద్యా సాంకేతికత 6) విద్యా ప్రణాళిక-పాఠ్య పుస్తకాలు. లక్ష్యాలను చేరుకోవటంలో ప్రస్తుత విధానంలో ఉన్న అడ్డంకులు, ఆ లక్ష్య సాధనకుగల అవకాశాలు, దానికి చేయవలసిన కృషి విద్యా లక్ష్యాల ఆధార పత్రంలో వివరించారు.
3. **రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత ముఖ్యమైన అంశాలు :** ఈ భాగంలో 5 పత్రాలున్నాయి. అవి 1)

విభిన్న వర్గాల విద్య (ఎస్సి,ఎస్టి, మైనార్టీ - బాలికలు-సమ్మిళిత విద్య) 2) ఆరోగ్య-వ్యాయామ విద్య 3) బాల్యారంభ విద్య 4) పని మరియు విద్య 5) నైతికత-విలువలు-మానవహక్కులు.

స్థూలంగా చూసినప్పుడు విద్యా ప్రణాళిక చట్రం-2011 ముసాయిదాలో 6 విభాగాలుగా పైన చెప్పిన 18 పత్రాలలోని సూచనలు క్రోడీకరించారు. అవి 1) వివేచన-దృక్పథం 2) జ్ఞానం - అభ్యసనం 3) ఉపాధ్యాయుడు 4) పాఠ్యాంశాలు 5) మేనేజ్‌మెంట్ ఆఫ్ లెర్నింగ్ 6) వ్యవస్థాపక సంస్కరణలు.

విద్యా ప్రణాళికా చట్రం ఉపాధ్యాయుని ఉన్నతి గురించి చర్చించింది. విద్యార్థిని లక్ష్యాలు సాధించేవైపు తీసుకువెళ్ళటంలో ఉపాధ్యాయుని పాత్ర విశ్లేషించింది. మార్పుకు దోహదకారిగా చెప్పింది. ఇదే సందర్భంలో విద్యా లక్ష్యాలు, అవి చేరటానికి ఎత్తుగడలు వాటి అమలు ఉపాధ్యాయులకు ఏ మేరకు తెలుసు? అనే అనుమానం వ్యక్తం చేసింది. వారి జవాబుదారీ తనాన్ని ప్రశ్నించింది. దాని వెనుకనే స్కూలు యాజమాన్యం, తల్లిదండ్రులు తక్షణ ఫలితాల కోసం ఆశించటం అది ఉపాధ్యాయుల పని విధానంపై ప్రభావం చూపటం, ఫలితంగా వారిపై ఒత్తిడి పెరుగుతోందనీ చెప్పింది. టీచరు ఎలా ఉండాలో చెప్పింది. ఇవి చెప్తూనే ప్రాథమిక పాఠశాలల్లో ఉన్నత విద్యార్హతలు గల ఉపాధ్యాయులు ఉండటం వలననే అక్కడ నాణ్యత తక్కువగా ఉందని రిపోర్టులో ఉటంకించింది.

కొత్త పీఆర్సీలో ఉపాధ్యాయుల జీతాలు గౌరవప్రదంగా పెరిగాయని, సమాజం ప్రభుత్వ ఉపాధ్యాయులకు గౌరవం ఇస్తోందని అయినా మొత్తమ్మీద సమాజం ప్రభుత్వ పాఠశాలల మీద నమ్మకం కోల్పోయిందని చెప్పింది. ఉపాధ్యాయులు ఎస్ఎంసిల మీద ఆసక్తి చూపటం లేదని గుర్తించామని చెప్పింది. ఈ స్థితి మార్చేందుకు పరిష్కారాలను సూచించారు. మూల్యాంకనము-పరీక్షలు గురించి రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం "పరీక్షలు కూడ పిల్లల్ని అంచనా వేయటానికి బదులుగా పిల్లల్ని దోషులుగా చూపటానికి, న్యూనతకు గురయ్యేలా చేయటానికి, ఒత్తిడి, ఆందోళన పెంచటానికి తోడ్పడుతున్నాయి. ఒక రకంగా పరీక్షలే విద్యా వ్యవస్థను శాసిస్తున్నాయని చెప్పవచ్చు" అని ఆధార పత్రంలో పేర్కొంది. ఈ స్థితి మారటానికి చేసిన సూచనల్లో కొన్ని....

1. ఆర్‌టిఇ-2009 సూచించిన విధంగా 8వ తరగతి వరకూ బోర్డు పరీక్షలు ఉండకూడదు.
2. పిల్లల్లో పరీక్షల భయాన్ని, ఒత్తిడిని, పోగొట్టే విధంగా పరీక్షల సంస్కరణలు ఉండాలి.
3. బోర్డు పరీక్షల్లో 50% వైటేజీ ప్రాజెక్టు వర్క్, అసైన్‌మెంట్స్, ప్రయోగాలు మొ॥ వాటికిచ్చి 50% బోర్డు పరీక్షలకు ఇవ్వాలి.
4. 10వ తరగతి బోర్డు పరీక్షలు ప్రాసెస్ ఓరియంటెడ్‌గా, కంటిన్యూస్ అండ్ కాంప్రెహెన్సివ్‌గా ఉండాలి.
5. బోర్డు పరీక్షల జవాబు పత్రాలు కోరినప్పుడు తల్లిదండ్రులకు అందజేయాలి.

**వ్యవస్థాపక సంస్కరణలు :** రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం-2011 వ్యవస్థాపక సంస్కరణల మీద చర్చించింది. ప్రస్తుత విధానం విద్యా ప్రమాణాలను పెంచటంలో ఎదుర్కొంటున్న సవాళ్ళను విశ్లేషించింది. భర్తీ చేయని ఉపాధ్యాయ ఖాళీలు, పాఠశాలల్లో త్రాగునీరు, మరుగు దొడ్ల కొరత, ఇలాంటివి ప్రస్తావించింది. పాఠ్యాంశాలకు, నిజ జీవితంలో ఎదుర్కొనే సమస్యలకు సంబంధం

లేకపోవటం ఒక సవాలుగా పేర్కొంది. ఉపాధ్యాయుల, విద్యార్థుల గైర్హాజరు, ప్రజల భాగస్వామ్యం లేకపోవటం వంటి అనేక సమస్యలు ముందుంచింది. దానికి సూచించిన పరిష్కార మార్గాలలో కొన్ని....

1. పరిపాలన మరియు పాఠశాల నిర్వహణలో వికేంద్రీకరణ కోసం పంచాయితీరాజ్ సంస్థలను భాగస్వామ్యం చేయటం
2. ప్రణాళిక, నిర్వహణ, మానిటరింగ్, నిధుల వినియోగం మొ॥ అంశాలలో వికేంద్రీకరణ విధానాలు అమలు పరచడం
3. పాఠశాల విద్యకు చెందిన వివిధ సంస్థలు (పాఠశాల, స్కూలు కాంప్లెక్స్,ఎంఆర్‌సి, డైట్, ఎస్‌సిఇఆర్‌టి) మరియు వ్యక్తులకు పనితీరు సూచికలు రూపొందించి అమలు జరపటం ద్వారా జవాబుదారీ తనం పెంచటం
4. వివిధ విధానాలు, పథకాలు స్కూలు స్థాయిలో సంతృప్తికరంగా అమలు చేయటానికి వీలుగా ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు మరిన్ని నిర్ణయాధికారాలు ఇవ్వటం
5. పాఠశాలలను సమాజానికి, విద్యా భాగస్వాములకు జవాబుదారీ తనం చేయటం
6 ఆర్‌టిఇ 2009 సూచించిన విధంగా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టటం.

ఇవికాక ప్రముఖంగా రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం 2011 ఉపాధ్యాయ సంఘాల పాత్రను ప్రస్తావించింది. ప్రస్తుతం ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల సర్వీసు కండిషన్స్, హక్కులు, బదిలీలు, ప్రమోషన్ల కోసం పరిమితమవుతున్నాయని, ఉపాధ్యాయ వృత్తిపరమైన అభివృద్ధిపై పెద్దగా కృషి చేయటం లేదని చెప్తూ దీనికి ఈ సిస్టమ్ కూడ సంఘాలను అదే కోణంలో చూడటం కారణమని చెప్పింది. ప్రభుత్వం, విద్యాశాఖ వృత్తిపరమైన శిక్షణ ఇవ్వటం కేవలం తమ బాధ్యతగా భావించిందని, ఏనాడు ఉపాధ్యాయ సంఘాలను ఈ విషయాలలో భాగస్వాములను చేయలేదని స్పష్టంగా చెప్పింది. (రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం-2011 కోసం ఏర్పాటు చేసిన కమిటీల్లో / సలహా దారుల్లో టీచర్స్ యూనియన్స్‌గాని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగాని లేరు) దీనిపై స్పందించి టీచర్స్ కెపాసిటీ బిల్డింగ్ కోసం ఉపాధ్యాయ సంఘాలకు సహకరించి ఆర్థిక సహకారం ఇవ్వటం అవసరమని చెప్పింది. వారు వివిధ బోధనాంశాలపై చర్చించటానికి, బోధనాభ్యసన ప్రక్రియలు చర్చించటానికి నిర్వహించే సెమినార్లు, వర్క్‌షాపులకు సహకరించాలని సూచించింది.

రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం-2011 రూపురేఖలు, కొన్ని అంశాలు ఉపాధ్యాయులకు ఉపయోగపడతాయని మీ ముందు ఉంచాము. ఈ డాక్యుమెంటు ఉపాధ్యాయులు, ఉద్యమ కార్యకర్తలు మరింత లోతుగా చదివితే ప్రభుత్వ లక్ష్యాలు, విద్యారంగం మీద వారి ఆలోచనలు మరింత బోధపడతాయి. దీనిని అధ్యయనం చేసి మీ సలహాలు సూచనలు ప్రభుత్వానికి పంపండి. మీ అభిప్రాయాలు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆహ్వానిస్తోంది. మీ అందరి అభిప్రాయాలు, సంఘం అభిప్రాయాలు కలిపి ప్రభుత్వానికి తెలియజేద్దాం. దీనిపై అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వానికి 30.11.2011 నాటికి చేరాలి. ఏం మారుస్తున్నారో, ఎలా మార్చాలనుకొంటున్నారో ప్రజల ముందు పెట్టారు. మన అభిప్రాయాలు, సూచనలకు ఆహ్వానం పలికారు. దీనిని ఉపయోగించుకొందాం.

♦♦♦